సాక్షి
కర్నూలు
గురువారం । 24 । ఏప్రిల్ । 2025



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథంలో భాగంగా బుధవారం నిత్య కళా వేదికపై సికింద్రాబాద్‌కు చెందిన కీర్తి ఆర్ట్స్ అకాడమీ కళాకారులు సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు.



పల్లె ముంగిట్లోనే 'పాలన'

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖలో మార్పులు తీసుకొచ్చింది. అవినీతి లేకుండా వివిధ ప్రభుత్వ సేవలను గ్రామ/వార్డు సచివాలయ స్థాయిలోనే అందించింది. 4లో▸



స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో రేంజ్-2 స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్- 2025 మొదటిసారిగా ప్రారంభమైంది. ఈనెల 25వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయి. 4లో▸

న్యూస్‌రీల్

రానున్న మూడు రోజుల్లో వానలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో రానున్న మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లుగా వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో దక్షిణ, నైరుతి గాలులు వీస్తున్నాయి. ఫలితంగా ఉరుములు, మెరుపులతో కూడిన బలమైన గాలులు వీచే అవకాశం ఉంటుందని తెలిపారు. గాలుల తీవ్రత గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయన్నారు. ఇదే సమయంలో 2 నుంచి 3 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.

నేటి నుంచి మెగా డీఎస్సీకి ఆన్‌లైన్ కోచింగ్

కర్నూలు(అర్బన్): వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేది నుంచి మెగా డీఎస్సీకి ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ప్రారంభిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి కె.ప్రసూన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే జిల్లాలో ఏపీ టెట్‌లో అర్హత సాధించిన బీసీ, ఈడబ్ల్యూఎస్, ఎస్టీ, ఎస్సీ వర్గాలకు చెందిన 191 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇతర వివరాలకు బిర్లాగేట్ సమీపంలోని జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.4.05 కోట్లు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠానికి మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి రూ.4,05,95,395 ఆదాయం సమకూరినట్లు ఏఏఓ మాధవ శెట్టి తెలిపారు. ఆయా నెలల్లో 32 రోజులకు ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఇందులో నగదు రూపేణా రూ.3,93,72,935, నాణేల రూపంలో రూ.12,22,400 రాగా.. 116 గ్రాముల బంగారం, 1,495 గ్రాముల వెండి వచ్చినట్లు వెల్లడించారు.

19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు సిటీ: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు వచ్చే నెల 19 నుంచి 28వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నేటి నుంచే ఈనెల 30వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. రీకౌంటింగ్, వెరిఫికేషన్ ఫీజు చెల్లింపునకు వచ్చే నెల 1వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. రీకౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టు స్క్రిప్టుతో కలిపి రూ.500, రీవెరిఫికేషన్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 చెల్లించాలన్నారు. దరఖాస్తు, ఫీజు చెల్లింపునకు ఆన్‌లైన్‌లో మాత్రమే అవకాశం ఉందన్నారు.

శ్రీశైలంలో పోస్టు ఆడిట్ తనిఖీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ఆడిట్ అధికారులు పోస్టు ఆడిట్ తనిఖీలు చేపట్టారు. కర్నూలు, నంద్యాల ప్రాంతాల నుంచి వచ్చిన 18 మంది స్టేట్ ఆడిట్ అధికారులు బుధవారం దేవస్థాన పరిపాలన భవనం లోని సమీక్ష సమావేశ మందిరంలో తనిఖీలు నిర్వహించారు. 2018-19, 2019-20, 2022-23 సంవత్సరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రిజిస్టర్లు, రికార్డులు, బ్యాంకు లావాదేవీలు, ఖర్చులు, దేవస్థాన ఉద్యోగుల సర్వీస్ వ్యవహారాలను తదితర అంశాలపై సుమారు నెలరోజులపాటు ఆడిట్ చేయనున్నట్లు సమాచారం. ఏవైనా అభ్యంతరాలు ఉత్పన్నమైతే పూర్తి బాధ్యత సంబంధిత విభాగాధిపతులు వహించాలని ఈఓ ఆదేశించినట్లు తెలుస్తోంది.

నిప్పుల వాన

- పాణ్యంలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లా ప్రజలను వడగాల్పులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. భానుడు నిప్పుల వాన కురిపిస్తున్నాడా అన్నట్లు ఎండలు ఉంటున్నాయి. బుధవారం పాణ్యంలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలోనే నంద్యాల జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం గమనార్హం. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. వడదెబ్బకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా విపత్తుల నిర్వహణ అథారిటీ డీపీఎం అనుపమ తెలిపారు.

మండలం	ఉష్ణోగ్రత
మహానంది	43.6
అవుకు	43.4
గోస్పాడు	43.4
ఆళ్లగడ్డ	43.4
కొలిమిగుండ్ల	43.1
కౌతాలం	42.9
కోడుమూరు	42.6
కల్లూరు	42.3

మార్కులు మెరుగుబడి.. ఫలితం వెనుకబడి!

'పది'లో స్వల్పంగా పెరిగిన ఉత్తీర్ణత

- 66.1 శాతంతో చివరి నుంచి రెండో స్థానంలో జిల్లా
- మొదటి శ్రేణిలో 14,291 మంది విద్యార్థులు
- ఏడుగురు విద్యార్థులకు 597 మార్కులు
- ప్రభుత్వ యాజమాన్యాల్లోనూ విద్యార్థుల రాణింపు
- రెండు కేజీబీవీల్లో వంద శాతం ఉత్తీర్ణత
- ఫలితాల్లో బాలికలదే పైచేయి
- సత్ఫలితాలిచ్చిన ఇంగ్లిష్ మీడియం విద్య

కర్నూలు సిటీ: పదవ తరగతి పరీక్షల ఫలితాల పెంపునకు కూటమి ప్రభుత్వం వంద రోజుల ప్రణాళికను తయారు చేసి అమలు చేసింది. అయితే ఆ ప్రణాళిక అమలుపై క్షేత్ర స్థాయిలో సరైన పర్యవేక్షణ లోపించింది. కూటమి ప్రభుత్వం సంస్కరణల పేరుతో చదువులను విస్మరించింది. పశ్చిమ పల్లెల నుంచి వలస వెళ్లిన విద్యార్థులను గుర్తించి సకాలంలో వెనక్కి తీసుకురాలేకపోయింది. ఈ పరిణామాల నేపథ్యంలో పరీక్షల ఫలితాలు ఆశించిన స్థాయిలో రాలేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఫలితాల్లో జిల్లా గతేడాది కంటే ఈ ఏడాది ఉత్తీర్ణత 3.53 శాతం పెరిగింది. గత నెల 17 నుంచి 30వ తేది వరకు 172 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఈనెల 3 నుంచి 9వ తేది వరకు మూల్యాంకనం చేపట్టారు. గతేడాది 62.47 శాతంతో జిల్లా చిట్ట చివరి స్థానం దక్కించుకోగా.. ఈ ఏడాది 66.01 శాతం ఉత్తీర్ణతతో చివరి నుంచి రెండో స్థానంలో నిలిచింది. ఇక పదవ తరగతి పరీక్షలంటే సాధారణంగా బాలికలదే పైచేయి ఉంటుంది. తాజా ఫలితాల్లోనూ బాలికలే ముందంజలో నిలిచారు. మొత్తం విద్యార్థుల్లో 14,291 మంది ఫస్ట్ క్లాసు, 3,904 మంది సెకెండ్ క్లాస్, 2,389 మంది థర్డ్ క్లాసులో ఉత్తీర్ణులయ్యారు.

సత్ఫలితాలిచ్చిన ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్

పాఠశాల విద్యలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. ఇందులో భాగంగా విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం విద్యతో పాటు ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌ను ప్రవేశ పెట్టింది. ఈ సంస్కరణ తీసుకొచ్చిన తరువాత నిర్వహించిన పది పరీక్షల్లో ఫలితం స్పష్టంగా కనిపించింది. ఇంగ్లిష్ మీడియంలో రాసిన విద్యార్థులు తెలుగు మీడియం వారి కంటే అత్యధిక శాతం ఉత్తీర్ణులు కావడమే ఇందుకు కారణం. ఇంగ్లిష్ మీడియంలో రాసిన వారు సుమారు 85 శాతం ఉత్తీర్ణులు కాగా.. తెలుగు మీడియం విద్యార్థులు 40 శాతం కూడా ఉత్తీర్ణత సాధించలేకపోవడం గమనార్హం. ఇదిలాఉంటే గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లోనే అత్యధిక శాతం విద్యార్థులు ఫెయిల్ అయ్యారు.

34 స్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత

జిల్లాలో 517 స్కూళ్లకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాయగా, 34 స్కూళ్లలో 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 100 శాతం ఉత్తీర్ణతలో ఏపీ రెసిడెన్షియల్ స్కూల్(బాలికలు, బనవాసి), ఏపీ రెసిడెన్షియల్ స్కూల్(బాలురు, కాల్వ బుగ్గ), మహత్మజ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ స్కూల్(బాలికలు, ఆరేకల్లు), ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్(కర్నూలు), కేజీబీవీ క్రిష్ణగిరి, కేజీబీవీ పంచలింగాల స్కూల్‌కి చెందిన విద్యార్థులు 100 శాతం ఫలితాలు సాధించారు. ఈ స్కూళ్లలో చదివిన విద్యార్థులు టి.సాయి లిఖిత 592 మార్కులు(ఏపీజే అబ్దుల్ కలాం స్కూల్), వై.దేవిక 576 మార్కులు సాధించారు. మూడు కార్పొరేట్, 23 ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయి.

- జిల్లాలో ఏపీ మోడల్ స్కూళ్లు 16 ఉన్నాయి. ఈ స్కూళ్ల నుంచి 1,333 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 930 మంది పాసయ్యారు. కోడుమూరు ఏపీ మోడల్ స్కూల్‌కి చెందిన జి.సోహేల్ 583 మార్కులు సాధించారు.

కేజీబీవీల్లో..

జిల్లాలో 25 కస్తూర్బా గాంధీ విద్యాలయాలకు చెందిన 978 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 774 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో పంచలింగాల, క్రిష్ణగిరి కేజీబీవీలో 100 శాతం అత్యధికంగా, కోసిగిలో అత్యల్పంగా 43 శాతం ఉత్తీర్ణత సాధించారు. వై.దేవిక అత్యధికంగా 576 మార్కులు సాధించింది. 75 మందికి 500 మార్కులకు పైగా వచ్చాయి.

మున్సిపల్ హైస్కూళ్లు..

జిల్లాలో మున్సిపల్ హైస్కూళ్లకు చెందిన 1,838 మంది విద్యార్థుల్లో 961 మంది ఉత్తీర్ణత సాధించారు. కర్నూలు నగరంలోని ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ మెమోరియల్ స్కూల్‌లో 43 మంది పరీక్షలు రాయగా అందరూ పాసయ్యారు. ఈ స్కూల్‌కి చెందిన టి.సాయి లఖిత 595 మార్కులు సాధించింది. 42 మంది 500 మార్కులకు పైగా సాధించడం విశేషం.

- ఎయిడెడ్ స్కూళ్లకు చెందిన 187 మందిలో 102 మంది పాసయ్యారు. ఈ స్కూళ్లకు చెందిన బి.హేమప్రియకు 570 మార్కులు వచ్చాయి(సెయింట్ జోసెఫ్ హైస్కూల్, చిల్డ్రన్స్ పార్క్).
- ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్ల నుంచి 91 మందిలో 60 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో ఆలూరు స్కూల్‌కి చెందిన పి.అంజలి 564 మార్కులు అత్యధికంగా సాధించారు. ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లకు చెందిన 544 మందిలో 483 మంది ఉత్తీర్ణులు కాగా.. బిక్యాంపు రెసిడెన్షియల్ స్కూల్‌కి చెందిన ఎం.ప్రమీలా 587 మార్కులు సాధించింది. బీసీ వెల్ఫేర్ స్కూళ్లకు చెందిన 227 మందిలో 221 మంది ఉత్తీర్ణులైయ్యారు. ఈ స్కూళ్లకు చెందిన జి.హాసిని 592 మార్కులు సాధించారు.
- ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లకు చెందిన 374 మంది పరీక్షలు రాయగా, 360 మంది పాసయ్యారు. కాల్వబుగ్గ రెసిడెన్షియల్ స్కూల్, మహత్మజ్యోతి రావు పూలే స్కూల్ ఆరెకల్లులో 100 శాతం ఫలితాలు వచ్చాయి. పంచలింగాల స్కూల్ విద్యార్థి 592 మార్కులు సాధించారు.
- డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాలు 8 ఉన్నాయి. ఈ స్కూళ్లకు చెందిన 1,002 మంది పరీక్షలకు హాజరుకాగా 919 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 771 మంది మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.



బనవాసి గురుకుల పాఠశాల ముఖద్వారం

31,185	20,584	66.01
పరీక్షకు హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణులైన విద్యార్థులు	ఉత్తీర్ణత శాతం

72.21	60.36
బాలికల ఉత్తీర్ణత శాతం (10,730 మంది)	బాలుర ఉత్తీర్ణత శాతం (9,854 మంది)

జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు	
పగిడాల గీతిక	(597)
షేక్ మహమ్మద్	(597)
వెంకట కీర్తన	(597)
టి.గాయత్రి	(597)
సలీమా	(597)
జి.నందు	(597)
హరిణి	(597)
సాయి నందిని	(596)
వెంపలి రస్మితారెడ్డి	(596)
రత్నపల్లి మనుచరణ్	(596)
పి.రాజ్వాన	(596)
షేక్ తస్రీన్	(596)
నేహాతాళ యాస్మిని	(596)

బనవాసికి గురుకులానికి మరోసారి 'వంద'నం


వై.శ్రీవాణి


జి.నందిన


బి. కీర్తన


టి.బిందు

ఎమ్మిగనూరురూరల్: కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా బనవాసి గురుకుల పాఠశాల ఫలితాలను సాధిస్తోంది. బుధవారం ప్రకటించిన 10వ తరగతి పరీక్షల్లో ఈ పాఠశాల విద్యార్థులు వందశాతం మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 79 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాదించి తమ సత్తా మరోసారి చాటుకున్నారు. ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి గురుకుల పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ పాఠశాల 2007 నుంచి వరుసగా 18 సంవత్సరాలుగా వందశాతం ఉత్తీర్ణతను సాధిస్తూ వస్తోంది. ఈ ఏడాది వై. శ్రీవాణి 583, జి. నందిని 576, బి. కీర్తన 573, టి. బిందు 570, డీఎస్ భాగ్యశ్రీ 567, కె. సుమయ్యతప్సుం 566, పి. గీతాంజలి 559, పి. నందిని 559, వై.నందిని 558 మార్కులు సాధించారు. ప్రతి సారి ఇలాంటి ఫలితాలే వస్తున్నాయని ప్రిన్సిపాల్ సామ్రాజ్యం తెలిపారు.

డాక్టర్ కావాలన్నదే లక్ష్యం



హయగ్రీవరెడ్డికి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

మద్దికెర: పిండి మిషన్ పెట్టుకొని జీవనం చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు హయగ్రీవరెడ్డి పదో తరగతి ఫలితాల్లో 563 మార్కులు సాధించాడు. ఈ విద్యార్థి ఆదర్శపాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాడు. డాక్టర్ అయి పేదలకు సేవలు అందించడమే తన లక్ష్యమని ఈ విద్యార్థి తెలిపారు. ఇందుకు ఇంటర్‌లో ఎంబైపీసీ తీసుకొని నీట్ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధిస్తానని చెప్పారు.

ఉన్నత స్థాయికి చేరుతా..



సందేశ్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

హొళగుంద: పదో తరగతి ఫలితాల్లో హొళగుంద ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సందేశ్ 584 మార్కులు సాధించాడు. ఈ విద్యార్థి తండ్రి ఎస్.ఎస్. బసవరాజు తహసీల్దార్ కార్యాలయం ఎదుట చిన్న దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగించేవారు. విద్యార్థి అమ్మ ఎన్. ఎస్. శాంతి గృహిణి. వీరిద్దరూ కష్టపడి కుమారుడు సందేశ్‌ను చదివించారు. తల్లిదండ్రులు తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా పై చదువులు చదివి ఉన్నత స్థాయికి ఎదుగుతానని సందేశ్ తెలిపారు.

తల్లి కష్టంతో చదివి



తల్లి వద్ద విద్యార్థి ప్రేమ్ గణేష్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వీవర్స్ కాలనీ జెడ్పీ హైస్కూల్‌లో చదివిన ప్రేమ్ గణేష్ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 588 మార్కులు తెచ్చుకున్నారు. కుర్ణికులానికి చెందిన తన తండ్రి ఎం.శివకుమార్ అనారోగ్యంతో మృతిచెందారు. ఎమ్మిగనూరు శివన్న నగర్‌లో నివాసం ఉండే తల్లి శ్రావణి టైలర్‌గా పనిచేస్తూ కుమారుడు ప్రేమ్ గణేష్‌ను చదివించింది. తల్లి కష్టంతో చదివి పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన తాను ఇంటర్‌లో ఎంపీసీ గ్రూప్ తీసుకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తానని ప్రేమ్ గణేష్ తెలిపారు.

ఉగ్ర దాడి హేయమైన చర్య

- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన

కర్నూలు(టౌన్): అమాయకులపై ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని కర్నూలు మేయర్ బి.వై. రామయ్య అన్నారు. బుధవారం రాత్రి స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద కశ్మీర్‌లో ఉగ్రవాదుల ఊచకొత ఘటనను నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిని పిరికిపందల చర్యగా అభివర్ణించారు. అమాయకులను పొట్టన పెట్టుకోవడం క్షమించరాని నేరమన్నారు. దేశంలో అలజడి సృష్టించే ఉద్దేశంతో ఉగ్రవాదులు చేస్తున్న కుట్రలను కేంద్ర ప్రభుత్వం తిప్పి కొట్టాలన్నారు.

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదం ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైందన్నారు. దీన్ని కూకటి వేళ్లతో పెకలించాలన్నారు.
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మూద్దురు సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశంలోని ఇతర ప్రాంతాలు, విదేశీయులను సైతం ఉగ్రవాదులు అత్యంత క్రూరంగా చంపేశారన్నారు. ఉగ్రవాదంపై కేంద్రం ఉక్కుపాదం మోపాలన్నారు.
- వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అహమ్మద్ ఆలీఖాన్ మాట్లాడుతూ కశ్మీర్ ఘటనకు కారణమైన ఉగ్ర మూకలను వెతికి పట్టుకొని కఠినంగా శిక్షించాలన్నారు. అమాయకులను అత్యంత క్రూరంగా చంపడాని సహించరాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, జిల్లా నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ సర్కిల్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

బినామీ పేర్లతో లోన్లు

రామదుర్గంలో సొసైటీలో రూ.కోటికి పైగా స్వాహా

- ఏడాదిగా అక్రమాలకు పాల్పడుతున్న సీఈఓ
- 12 మంది బినామీ పేర్లతో రూ.36 లక్షలు స్వాహా
- 6గురి పేర్లతో డబుల్ లోన్‌లు
- ఫిక్స్‌డ్ డిపాజిట్లనూ స్వాహా చేసిన వైనం

కర్నూలు(అగ్రికల్చర్): అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మారిన సహకారంలో సరికొత్త కుంభకోణం వెలుగులోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పర్యవేక్షించాల్సిన సహకార శాఖ, జిల్లా సహకార కేంద్రబ్యాంకు అధికారులు కళ్లు మూసుకోవడంతో ఎవరికి వారు యథేచ్ఛగా దోపిడీ కొనసాగిస్తున్నారు. తాజాగా ఆలూరు నియోజకవర్గంలోని చిప్పగిరి మండలం రామదుర్గం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సొసైటీ సీఈఓ యు.రమేష్ బినామీ పేర్లతో రూ.కోటికి పైగా నిధులు కొల్లగొట్టారు. ఏడెనిమిదేళ్ల క్రితం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుకు అనుబంధంగా రామదుర్గం ఫార్మర్ సర్వీస్ కో-ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటైంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో పీఏసీఎస్‌గా మార్చి జిల్లా సహకార కేంద్రబ్యాంకులో సభ్యత్వం ఇచ్చారు. ఈ సంఘానికి జిల్లా సహకార కేంద్రబ్యాంకు నిధులు ఇవ్వలేదు. ఈ పీఏసీఎస్ సొంత నిధులతోనే కొనసాగుతోంది. ఇలాంటి సంఘంపై సంబంధిత అధికారుల ప్రత్యేక పర్యవేక్షణ తప్పనిసరి. ఆ దిశగా దృష్టి సారించకపోవడం అక్రమాలకు తావిచ్చింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి సొసైటీ టర్నోవర్ రూ.8.72 కోట్లు ఉంది. 2024-25లో సీఈఓ రమేష్ ఏకంగా రూ.1.07 కోట్లు స్వాహా చేసినట్లు స్పష్టమవుతోంది. ఇది కూడా ప్రాథమికంగా వెలుగు చూసినదే కావడం గమనార్హం.

సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారు

అక్రమాలకు పాల్పడిన సీఈఓను సహకార అధికారులు సస్పెండ్ చేసి చేతులు దులుపున్నారు. ప్రస్తుతం అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా లక్ష్మినారాయణ కొనసాగుతున్నారు. అక్రమాలు జరుగుతుంటే పర్సన్ ఇన్‌చార్జి గుర్తించకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమతున్నాయి. రామదుర్గం సొసైటీలో జరిగిన అక్రమాలపై ఆదోని డివిజనల్ సహకార శాఖ అధికారి శిరీష, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌కుమార్ విచారణ జరుపుతున్నారు. ఈ సొసైటీ పరిధిలో 8 గ్రామాలు ఉండగా 1,872 మంది సభ్యులు ఉన్నారు. ప్రతి లావాదేవీని పరిశీలిస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో అవినీతిలో ఎవరెవరి భాగస్వామ్యం ఎంత ఉందనే విషయం తెలియనుంది.

అక్రమాలు ఇలా..

- రామదుర్గం సీఈఓ రమేష్ బినామీ పేర్లతో లోన్‌లు సృష్టించి నిధులు డ్రా చేసుకున్నారు.
- 12 మంది బినామీ పేర్లతో ఒక్కొక్కరి పేరిట రూ.3 లక్షల ప్రకారం స్వల్పకాలిక రుణాలు కింద రూ.36 లక్షలు డ్రా చేసినట్లు తెలుస్తోంది.
- ఆరు బినామీ పేర్లతో ఒక్కొక్కరి పేరిట రెండు లోన్‌లు సృష్టించారు.
- ఫిక్స్‌డ్ డిపాజిట్లను కూడా స్వాహా చేసినట్లు తెలుస్తోంది.
- ప్రాథమికంగా నిర్ధారించిన మేరకు రూ.1.07 కోట్లు డ్రా చేసుకున్నారు.
- 2023-24 ఆర్థిక సంవత్సరం ఆడిట్‌లో అక్రమాలు వెలుగుచూడకపోవడం చూస్తే 2024-25 సంవత్సరంలోనే స్వాహా పర్వం నడిచినట్లు తెలుస్తోంది.
- సొసైటీలను ప్రస్తుతం కంప్యూటరీకరణ చేస్తున్నారు.
- ఇందులో భాగంగా ప్రతి లోన్‌కు ఆధార్ లింక్ చేయాల్సి ఉంది.
- రామదుర్గం సొసైటీలో బినామీ పేర్లతో తీసుకున్న రుణాలకు ఆధార్ లింక్ చేయాల్సి ఉన్న నేపథ్యంలో అవినీతి బయటపడింది.

జర్నలిస్టులకు రక్షణ కల్పించకపోతే ప్రజాస్వామ్యానికి హాని

- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాకు వినతిపత్రం ఇచ్చిన జర్నలిస్టులు

కర్నూలు(సెంట్రల్): సాక్షి దినపత్రిక ఏలూరు కార్యాలయంపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆయన అనుచరులు దాడి చేయడాన్ని సీనియర్ జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల నాయకులు తీవ్రంగా తప్పుపట్టారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశాయి. జర్నలిస్టులకు రక్షణ కల్పించకపోతే ప్రజాస్వామ్యానికి హాని కలిగే ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వెలిబుచ్చారు. బుధవారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాను ఆయన కార్యాలయంలో కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీ డబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోరంట్లప్ప, సీనియర్ జర్నలిస్టు సత్యనారాయణ గుప్తా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర ఎంతో ఉందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ తప్పులు, ఒప్పులు, అక్రమాలు నిజాలను బయట పెట్టే బాధ్యత పత్రికలపై ఉంటుందన్నారు. అందులో భాగంగా దృష్టికి వచ్చిన అంశాలపై కథనాలు, విశ్లేషణలు చేస్తుంటాయన్నారు. అయితే ఏదైనా పత్రికలో వార్త వచ్చిన సమయంలో సంబంధిత వ్యక్తులు ఇబ్బందిగా భావిస్తే ఖండన ఇవ్వవచ్చు అన్నారు. అందుకు సంతృప్తి చెందకపోతే న్యాయస్థానాల ద్వారా లీగల్‌గా ప్రొసీడ్ అయ్యేందుకు వీలు ఉందన్నారు. అయితే అవేవీ పట్టకుండా ప్రభుత్వంలోని కొందరు నేతలు పత్రికల్లో వార్తలు వస్తే జర్నలిస్టులను భయపెట్టే విధంగా దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టు కార్యాలయాలను ధ్వంసం చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఇటీవల కాలంలో జర్నలిస్టులు, జర్నలిస్టు సంస్థలపై దాడులు అధికమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శివశంకర్, ఎర్రమల, సీనియర్ జర్నలిస్టులు రవికుమార్, హుస్సేన్, రవిప్రకాష్, శ్రీనాథ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇచ్చిన అనంతరం జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాతో మాట్లాడుతున్న జర్నలిస్టులు

పల్లె ముంగిట్లోనే 'పాలన'

వైఎస్సార్‌సీపీ హయాంలో విప్లవాత్మక సంస్కరణలు

- దేశంలోనే ఆదర్శంగా సచివాలయ వ్యవస్థ
- ఆర్‌డీఓల తరహాలో డీఎల్‌డీఓ పోస్టులు
- నెరవేరిన ఎంపీడీఓల దశాబ్దాల కల
- జిల్లా అధికారులుగా పదోన్నతి పొందిన ఎంపీడీఓలు
- పర్యవేక్షకులను ఏఓలుగా గుర్తించి గెజిటెడ్ హోదా
- సచివాలయ ఉద్యోగులకు పేస్కేల్ అమలు
- నేడు పంచాయతీరాజ్ దినోత్సవం

జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన ఘనత గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. పాలనను ప్రజలకు అత్యంత చేరువ చేసేందుకు ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే తలమానికంగా నిలిచిందనడలో అతిశయోక్తి లేదు. ప్రభుత్వ పథకాలను ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా పారదర్శకంగా అందించేందుకు ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థను వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఆదర్శంగా తీసుకున్నాయి. ప్రభుత్వ పాలనలో అత్యంత కీలకమైన పంచాయతీరాజ్ శాఖలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడంతో అన్ని విభాగాల ఉద్యోగులకు న్యాయం జరిగింది.

కర్నూలు(అర్బన్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల వందల సంఖ్యలో ఉద్యోగులకు పదోన్నతుల పరంపర ప్రారంభమైంది. ముఖ్యంగా ఉద్యోగంలో చేరినప్పటి నుంచి పదవీ విరమణ అయ్యేంతవరకు ఎలాంటి పదోన్నతులు లేకుండా ఉన్న ఎంపీడీఓలకు పదోన్నతులు కల్పించి గత ప్రభుత్వం చరిత్రాత్మకమైన నిర్ణయం తీసుకుంది. 2022 ఆగస్టు నెలలో అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల జిల్లాలో అర్హులైన దాదాపు 17 మంది ఎంపీడీఓలు వివిధ ప్రభుత్వ శాఖల్లో జిల్లా అధికారులుగా పదోన్నతి పొందారు. వీరి కంటే ముందు (2020 అక్టోబర్ నెలలో) రెవెన్యూ శాఖలో ఉన్న విధంగానే (ఆర్‌డీఓ తరహాలో) పంచాయతీరాజ్ శాఖలో కూడా డివిజన్ స్థాయిలో డీఎల్‌డీఓ పోస్టును క్రియేట్ చేసి అర్హులకు పదోన్నతులు కల్పించారు. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి జిల్లాకు ముగ్గురు డీఎల్‌డీఓలు వచ్చారు. ఎంపీడీఓలకు పదోన్నతులు ప్రారంభం కాగానే, క్షేత్ర స్థాయి (ఆఫీస్ సబార్డినేట్) నుంచి పదోన్నతుల ప్రక్రియ ఊపందుకుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో అర్హత కలిగిన 17 మంది ఎంపీడీఓలు జిల్లా స్థాయి అధికారులుగా పదోన్నతిపై వెళ్లగా, వారి స్థానంలో 14 మంది ఏఓ, 13 మంది ఈఓఆర్‌డీలకు 2023 మే నెలలో ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పించారు. వీరి స్థానంలో 9 మంది సీనియర్ అసిస్టెంట్లు, 15 మంది గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు ఈఓఆర్‌డీలుగా పదోన్నతి లభించింది. ఈ నేపథ్యంలోనే సీనియర్, జూనియర్ సహాయకులు, టైపిస్టులు, రికార్డు అసిస్టెంట్లకు వారి అర్హతలను బట్టి పదోన్నతులు దక్కాయి.



జిల్లా పరిషత్ భవనం

జిల్లా అధికారులుగా ఎంపీడీఓలు

గత ప్రభుత్వం పదోన్నతులు కల్పించడం వల్ల అనేక మంది ఎంపీడీఓలు వివిధ ప్రభుత్వ శాఖల్లో జిల్లా అధికారులయ్యారు. పరిషత్ సీఈఓ, డిప్యూటీ సీఈఓ, జిల్లా పంచాయతీ అధికారి, డ్వామా, డీఆర్‌డీఏ, మెప్మా, హౌసింగ్ శాఖల్లో పీడీలుగా, పలు శాఖల్లో కీలకమైన పోస్టుల్లో పదోన్నతి పొందారు

పర్యవేక్షకులను ఏఓలుగా గెజిటెడ్ హోదా

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించిన వివిధ కార్యాలయాల్లో (ఎంపీడీఓ, జెడ్పీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్) పర్యవేక్షకులుగా(సూపరింటెండెంట్) ఉన్న వారిని పరిపాలనాధికారులుగా (ఏఓ)లుగా గుర్తించారు. వీరికి గెజిటెడ్ హోదా కల్పించిన ఘనత గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కింది.

దేశానికే తలమానికంగా సచివాలయ వ్యవస్థ

- వైఎస్సార్‌పీపీ పాలనలో ఏర్పాటైన సచివాలయ వ్యవస్థ ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 10వేల మందికి ఉద్యోగాలు వచ్చాయి.
- కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మొత్తం 1188 గ్రామ/వార్డు సచివాలయాలు ఉండగా, వీటిలో కర్నూలు జిల్లాలో 465 గ్రామ సచివాలయాలు, 207 వార్డు సచివాలయాలు ఏర్పాటయ్యాయి.
- నంద్యాల జిల్లాలో 420 గ్రామ సచివాలయాలు, 96 వార్డు సచివాలయాలు ఉన్నాయి.
- సచివాలయాల్లో మొత్తం మంజూరైన పోస్టులు 9,878 కాగా, 8,630 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.
- వీరిలో రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకోవడంతో పాటు డిపార్టుమెంటల్ టెస్ట్ ఉత్తీర్ణులైన 7,466 మంది ఉద్యోగుల ప్రొబేషన్ ముందుగా డిక్లేర్ కాగా, మిగిలిన వారికి విడతల వారీగా డిక్లేర్ చేశారు.
- ప్రొబేషన్ డిక్లేర్ కావడంతో పే స్కేల్‌ను కూడా అమలు చేశారు.
- ఉద్యోగంలో చేరిన సమయంలో నెల జీతం రూ.15 వేలు ఉండగా, ప్రస్తుతం గ్రాస్‌గా ప్రతి సచివాలయ ఉద్యోగి దాదాపు నెలకు రూ.30 వేల వరకు డ్రా చేస్తున్నారు.
- అలాగే గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు నెలకు రూ.32 వేల వరకు డ్రా చేస్తున్నారు.

సచివాలయ వ్యవస్థతో వేలాది ఉద్యోగాలు



2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 73వ రాజ్యాంగ సవరణ ముఖ్య ఉద్దేశాన్ని గుర్తించింది. గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి వేలాది ఉద్యోగాల కల్పనకు కారణమయ్యారు. ప్రతి 2వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. నూతన సాంకేతిక ఒరవడితో ఆన్‌లైన్ సదుపాయం కల్పించారు. ఎంపీడీఓల పదోన్నతులకు శ్రీకారం చుట్టారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాల వల్ల జిల్లా పరిషత్‌లలో పీఆర్‌కు చెందిన వారే సీఈఓ, డిప్యూటీ సీఈఓలుగా విధులు నిర్వహిస్తున్నారు.

– జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

మూడంచెల పీఆర్ వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు



వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో 1.20 లక్షల ఉద్యోగాలు వచ్చాయి. ఎలాంటి అవినీతికి తావు లేకుండా వివిధ ప్రభుత్వ సేవలను గ్రామ/వార్డు సచివాలయ స్థాయిలోనే అందించారు. ప్రతి 50 కుటుంబాలకు ఒకరు ప్రకారం ఏర్పాటు చేసిన వలంటీరు వ్యవస్థ వల్ల ఎంతో మేలు జరిగింది. ఎన్నో సంవత్సరాలుగా పదోన్నతులకు నోచుకోని ఎంపీడీఓలకు పదోన్నతులు లభించాయి.

– జీ జయపాల్‌రెడ్డి, రిటైర్డు జెడ్పీ సీఈఓ, ఎస్‌ఐఆర్‌డీ తెలంగాణ కన్సల్‌టెంట్

క్లుప్తంగా

దేశ సమైక్యతను దెబ్బతీసే కుట్ర

- కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



కర్నూలు (టౌన్): దేశ సమైక్యతను దెబ్బతీసేందుకే ఉగ్రవాదులు దాడులకు పాల్పడుతున్నారని, వారి కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. పర్యాటక ప్రాంతమైన జమ్మూ కశ్మీర్ పహల్గామ్‌లో జరిగిన ఉగ్ర దాడిని బుధవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఉగ్ర మూకల విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలన్నారు. మృతుల కుటుంబాలకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రగాఢ సానుభూతి తెలుపుతుందని, కేంద్ర ప్రభుత్వం వారికిఅన్ని విధాలుగా అండగా నిలబడాలని కోరారు.

మంగళగిరికి ఎంపీడీఓలు, స్థానిక ప్రజా ప్రతినిధులు

కర్నూలు(అర్బన్): జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 24న (నేడు) మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర స్థాయి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. బుధవారం జెడ్పీలోని తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రస్థాయి కార్యక్రమానికి తనతో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎంపీడీఓలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు హాజరవుతున్నట్లు వెల్లడించారు.

గనులపై మైనింగ్ అధికారుల దాడులు

కొలిమిగుండ్ల: బెలుం-బెలుం శింగవరం గ్రామాల మధ్యలో ఉన్న నాపరాతి గనులపై బుధవారం భూగర్భ గనుల శాఖ అధికారుల బృందం దాడులు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ మైనింగ్ చేస్తున్నారనే కారణంతో స్థానిక పోలీసులతో కలిసి మైనింగ్ అధికారులు ఈ దాడులు చేశారు. ఎంత మేర గనుల తవ్వకా లు చేశారనే వాటిపై కొలతలు సేకరించారు. నాపరాళ్ల వెలికి తీసేందుకు ఉపయోగించే ఆరు కోత మిషన్లతో పాటు ప్రొక్లెయినర్, ట్రిప్పర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉంచారు. అధికారులు దాడులకు వచ్చా రని తెలుసుకున్న చుట్టు పక్కల గనుల యజమానులు, కూలీలు అక్కడి నుంచి ఖాళీ చేసి వెళ్లి పోయారు.

ఏసీబీ డీఎస్పీగా సోమన్న



కర్నూలు: కర్నూలు రేంజ్ ఏసీబీ డీఎస్పీగా సోమన్న నియమితులయ్యారు. సార్వత్రిక ఎన్నికల ముందు ఇక్కడ డీఎస్పీగా ఉన్న వెంకటాద్రి చిత్తూరు స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి డీఎస్పీ స్థానం ఖాళీగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలల తర్వాత డీఎస్పీ పోస్టును భర్తీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అనంతపురం జిల్లాకు చెందిన సోమన్న 1991లో ఎస్‌ఐ హోదాలో పోలీసు శాఖలో చేరి కర్నూలు రేంజ్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఎస్‌ఐగా, సీఐగా సేవలందించారు. కొంతకాలం పాటు ఆదోని డీఎస్పీగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం విజయవాడ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్‌లో పనిచేస్తున్న ఈయన కర్నూలుకు నియమితులయ్యారు. అయితే మరో ఆరు మాసాల పాటు అటాచ్‌మెంట్ కింద సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్‌లోనే విధులు నిర్వహిస్తూ కర్నూలు పర్యవేక్షణ బాధ్యతలు కూడా చూసుకునేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రెండు సీఐ పోస్టులు ఖాళీ

కర్నూలు రేంజ్ ఏసీబీ విభాగంలో ప్రస్తుతం క్రిష్టారెడ్డి, క్రిష్ణయ్య, రాజ ప్రభాకర్, శ్రీనివాసులు సీఐలుగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఇంతియాజ్, వంశీనాథ్, ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లడంతో రెండు సీఐ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఖాళీ సీఐ పోస్టులను కూడా భర్తీ చేసి ఏసీబీ విభాగాన్ని పటిష్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మంచం పట్టిన కలపరి

- గ్రామంలో వంద మందికి పైగా జ్వరం
- ప్రతి ఇంట్లో ఇద్దరు, ముగ్గురు బాధితులు
- కన్నెత్తి చూడని వైద్యారోగ్యశాఖ అధికారులు

ఆస్పరి: మండలంలోని కలపరి గ్రామం మంచం పట్టింది. ఈ గ్రామంలో 110 కుటుంబాలుండగా, ప్రతి ఇంట్లో ఇద్దరు, ముగ్గురు జ్వరాలతో బాధపడుతున్నారు. స్థానిక ఆర్‌ఎంపీల వద్ద చూపించుకుంటున్నా తగ్గడం లేదని వాపోతున్నారు. సమస్య ఇంత తీవ్రంగా ఉంటే వైద్యారోగ్యశాఖ అధికారులు ఇటువైపు కన్నెతి చూసిన దాఖలాలు లేవు. వెంకమ్మ అనే వృద్ధురాలు పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మల్లమ్మ, మల్లికార్జున, ఉరుకుందు, సోమన్న, లక్ష్మి, మునిస్వామి, వీరేష్, వెంకటలక్ష్మి, ఆటో ఉరుకుందప్ప, సూరి, లోకేశ్వరీతో పాటు వందమంది వంద మంది జ్వరం, కాళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. దాదాపు రెండు వారాల నుంచి ఈ సమస్య ఉంది. ఇళ్లలో ఒకరి తర్వాత ఒకరు జ్వరం బారిన పడుతున్నారు. పారిశుద్ధ్య లోపమా లేక మరే కారణమో తెలియదని, అధికారులు స్పందించి వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కలపరిలో కుటుంబమంతా జ్వరం బారిన పడిన దృశ్యం



ఇంట్లోనే చికిత్స పొందుతున్న వెంకటలక్ష్మి

మా అమ్మ కోమాలోకి వెళ్లింది



మా అమ్మ వెంకమ్మ జ్వరంతో బాధపడుతూ కోలుకోలేక కోమాలోకి వెళ్లింది. వారం రోజులు క్రితం జ్వరం రావడంతో ఆర్‌ఎంపీల వద్ద చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించాం. డాక్టర్లు కోమాలోకి వెళ్లిందని చెప్పారు. మా గ్రామంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదు. అధికారులు స్పందించి జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– గిడ్డయ్య కలపరి గ్రామం. ఆస్పరి మండలం

ఇంట్లో నలుగురూ జ్వరంతో బాధపడుతున్నారు



మా ఇంట్లో నలుగురం ఉంటాం. మా అందరికీ జ్వరం వస్తుంది. జ్వరంతో పాటు కాళ్లు, కీళ్ల నొప్పులు ఉన్నాయి. ఆర్‌ఎంపీలతో వైద్యం చేయించుకున్నా తగ్గడం లేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. అధికారులు స్పందించి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి.

– మల్లమ్మ, కలపరి గ్రామం, ఆస్పరి మండలం



ఉగ్రభూతానికి చిత్రరూపం

నంద్యాల(అర్బన్): జమ్ము కాశ్మీర్‌లో జరిగిన ఉగ్ర నరమేధంపై నంద్యాల చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ స్పందించారు. ఉగ్రభూతానికి 26 మంది భారతీయులు, ఇద్దరు పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన ఘటనకు చిత్రం రూపం ఇచ్చాడు. టెర్రరిజం అమాయక ప్రజల రక్తం రుచి మరిగిందని చిత్రం ద్వారా చూపించాడు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

ఓర్వకల్లు: భర్త పెట్టే వేధింపులు తట్టుకోలేక మహిళ అత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని నన్నూరు గ్రామంలో బుధవారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీలో నివాసముంటున్న వెంకటేష్ కొడుకు తిరుమలేష్ పెయింట్ పనులకెళ్తుంటాడు. ఆరు నెలల క్రితం కర్నూలు నగరానికి చెందిన మోహన్ కుమార్తె బలగం అంజలి (23)ని పెళ్లి చేసుకున్నాడు. రెండు నెలల నుంచి భార్యను మానసికంగా వేధించడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కూడా పూటుగా మద్యం తాగి వేధింపులకు గురిచేయడంతో అంజలి బుధవారం ఉదయం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఉరి నుంచి కిందకు దించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

టీడీపీ నేత మమ్మల్ని వేధిస్తున్నాడు

- పార్టీ జిల్లా కార్యాలయం ఎదుట పత్తికొండ మహిళల ఆందోళన



నిరసన తెలుపుతున్న మహిళలు

కర్నూలు(రూరల్): పత్తికొండ షాడో ఎమ్మెల్యేగా చెలమణి అవుతున్న సాంబశివారెడ్డి తమను వేధిస్తున్నాడని అతనిపై పార్టీ హైకమాండ్ చర్యలు తీసుకోవాలని బాధిత మహిళలు ఆందోళనకు దిగారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ మహిళ ఐక్య వేదిక వ్యవస్థాపకురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి ఆధ్వర్యంలో వారు బుధవారం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా పార్టీలో ఉన్న తమను కనీసం గౌరవం ఇవ్వకపోగా ప్రతి పనిలో అడ్డు తగులుతున్నాడని పత్తికొండ రామచంద్రరెడ్డి నగర్, కొండగేరికి చెందిన పార్వతీబాయి, లలితాబాయి, కురువ లలిత, కురువ వరలక్ష్మి కుటుంబాలు వాపోయాయి. పొదుపు సంఘాల్లో జోక్యం చేసుకుంటూ విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్‌గా తుగ్గలి మహిళను తీసుకొచ్చి పెట్టారన్నారు. ఈ అన్యాయంపై అధికారులకు కలిసి విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ ఆందోళనలో పొదుపు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ బెటాలియన్‌లో రేంజ్-2 స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

- రాష్ట్ర విభజన తర్వాత మొదటిసారి జరుగుతున్న క్రీడాపోటీలు

కర్నూలు : రాష్ట్ర విభజన తర్వాత కర్నూలు ఏపీఎస్పీ రెండవ బెటాలియన్‌లో రేంజ్-2 స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్- 2025 మొదటిసారిగా ప్రారంభమైంది. బెటాలియన్ కమాండెంట్ దీపిక పాటిల్ ముఖ్య అతిథిగా హాజరై పరేడ్ గ్రౌండ్‌లో క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈనెల 25వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. కర్నూలుతో పాటు కడప, అనంతపురం, చిత్తూరుతో పాటు స్పెషల్ ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆఫ్ సెంట్రల్ పోలీస్ లైన్, అంబర్‌పేట, హైదరాబాదు (ఎస్‌ఏఆర్‌సీపీఎల్) బెటాలియన్స్‌కు చెందిన పోలీసు క్రీడాకారులు స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్నారు. బుధవారం ప్రారంభ రోజు జావెలిన్ త్రో, లాంగ్‌జంప్, 800 మీటర్ల పరుగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజయం సాధించిన వివిధ పటాలాలకు చెందిన క్రీడాకారులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కమాండెంట్ అందజేశారు. జావెలిన్ త్రోలో 11వ బెటాలియన్‌కు చెందిన పీసీ యు.ప్రదీప్ కుమార్ మొదటి బహుమతి కైవసం చేసుకోగా 9వ బెటాలియన్‌కు చెందిన పీసీ గోపీనాథ్ రెండో బహుమతి, 11వ బెటాలియన్‌కు చెందిన నరసింహ మూడో బహుమతి దక్కించుకున్నారు. లాంగ్‌జంప్‌లో 11వ బెటాలియన్ పీసీ ప్రదీప్ కుమార్ మొదటి బహుమతి, రిజర్వు ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ రెండో బహుమతి, ఎస్‌ఏఆర్‌సీపీఎల్ యూనిట్ పీసీ వెంకటేశ్వర్లు మూడో బహుమతి గెలుచుకున్నారు. అలాగే 800 మీటర్ల పరుగుపందెంలో రెండో బెటాలియన్ పీసీ నరేంద్ర మొదటి బహుమతి, 9వ బెటాలియన్ పీసీ వెంకయ్య రెండో బహుమతి, పీసీ అశోక్ మూడో బహుమతి సాధించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నాగేంద్ర రావు, అసిస్టెంట్ కమాండెంట్లు మహబూబ్ బాషా, రవికిరణ్, వెంకటరమణ, సుధాకర్‌రెడ్డి, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్లు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



పరుగుపందెం విజేతలతో వివిధ బెటాలియన్లకు చెందిన పోలీస్ సిబ్బందితో కమాండెంట్ దీపిక

జిల్లా అంతటా విజిబుల్ పోలీసింగ్

కర్నూలు: ప్రజల భద్రత, రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు జిల్లా అంతట విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం ఏకకాలంలో జిల్లా అంతటా విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా రోడ్డు భద్రత నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేవారు హెల్మెట్/సీటు బెల్టు ధరించాలని, డ్రంకెన్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలని వాహనదారులకు సూచనలు చేశారు. ఆయా స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో పర్యటించి గొడవలకు దూరంగా ఉండాలని, మహిళా నేరాలు, సైబర్ మోసాలు, బాల్య వివాహాలు, పేకాట వంటి వాటిపై పోలీసులకు సమాచారమివ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. గంజాయి, మత్తు పదార్థాల వాడకంతో కలిగే అనర్థాల గురించి ప్రజలకు వివరించి వాటికి దూరంగా ఉండాలని యువకులకు సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

కుక్కను తప్పించబోయి..

పత్తికొండ రూరల్: పత్తికొండ-కర్నూలు రోడ్డులో అడ్డు వచ్చిన కుక్కను తప్పించబోయి బుధవారం కారు బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. సిమెంట్‌నగర్‌కు చెందిన భాను ప్రకాశ్, శంకరమ్మ దంపతులు, ఇద్దరు పిల్లలు కలిసి మద్దికెరలోని మామ మనవరాలి నామకరణ మహోత్సవానికి కర్నూలు నుంచి కారులో బయల్దేరారు. పత్తికొండ సమీపంలో ప్రధాన రోడ్డుకు అడ్డంగా కుక్క రావడంతో దాన్ని తప్పించబోగా కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్లలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారందరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.



పత్తికొండ-కర్నూలు రోడ్డులో బోల్తా పడిన కారు

ట్రాన్స్‌జెండర్ల సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు(అర్బన్): జిల్లాలో ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి తెలిపారు. బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు/జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది ఆదేశాల మేరకు స్థానిక న్యాయ సేవా సదన్‌లో ట్రాన్స్‌జెండర్ల హక్కులపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ట్రాన్స్‌జెండర్లు తమకు గుర్తింపు కార్డులు, రేషన్‌కార్డులు లేని కారణంగా పింఛన్లు రావడం లేదని జడ్జి దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఆయన స్పందిస్తూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ట్రాన్స్‌జెండర్లు అందుబాటులోని పథకాలను తెలుసుకొని ప్రయోజనం పొందాలన్నారు. టీజీఐడీ నేషనల్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుంటే గుర్తింపు కార్డులు వస్తాయన్నారు. దివ్యాంగులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్స్‌కు అనేక ప్రభుత్వ పథకాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్యానెల్ న్యాయవాది హేమలత మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లకు న్యాయ సహాయం అందించేందుకు తోడ్పడతామన్నారు. సదస్సులో ట్రాన్స్‌జెండర్ల నాయకులు వీణారెడ్డి, శ్రీవాణి, పావని తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి